క్లుప్తంగా

అత్యాశకు పోయి మోసపోవద్దు


అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

పెద్దపల్లిరూరల్: ఈజీగా డబ్బు సంపాదించే అవకాశాలు కల్పిస్తామని చెప్పే వారితో అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు పోయి మోసగాళ్ల వలలో పడొద్దని షీటీం సభ్యురాలు స్నేహలత అన్నారు. పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో మంగళవారం ఆన్‌లైన్ మోసాలు, మహిళల భద్రత, యాంటీడ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. వేధింపులకు గురైతే వెంటనే డయల్100కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడితే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, హెచ్ఎం లక్ష్మణస్వామి ఉన్నారు.

రోడ్లపై గుంతలు కనపడొద్దు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న రోడ్లపై గుంతలు కనపడొద్దని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ అన్నారు. వర్షాకాలం కావడంతో పలు కాలనీలలో గుంతలు పడడంతో మంగళవారం ట్రాక్టర్ ద్వారా వాటిని చదును చేయించారు. అనంతరం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పెరిగిన మొక్కలను శుభ్రం చేయించారు. మున్సిపల్ పరిధిలోని మెయిన్ రోడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. రాజ్‌కుమార్, రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, స్వర్ణలత, శానిటేషన్ సిబ్బంది శ్రావణ్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్, ఓడెడ్, ముత్తారంలోని వ్యవసాయ పంటలను మంగళవారం మండల వ్యవసాయాధికారి అనూష పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి పంటలను పరిశీలించారు. పత్తికి, వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందుల గురించి రైతులకు వివరించారు. ఏఈవో మనీషా ఉన్నారు.

ఎరువులు నిల్వచేస్తే చర్యలు తప్పవు


రికార్డు తనిఖీ చేస్తున్న ఏవో భాస్కర్

ఓదెల: ఎరువులను నిల్వచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఓదెల వ్యవయాధికారి భాస్కర్ అన్నారు. మండలంలోని గుంపుల, పొత్కపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు సరిగా నిర్వహించాలని డీలర్లకు సూచించారు. మండలంలో ప్రస్తుతం 210 టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. ఎరువుల అమ్మకాల్లో డీలర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడినా తమదృష్టికి తీసుకురావాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు ప్రింటర్ అందజేత



ఎలిగేడు: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన పోలీస్ స్టేషన్‌కు రాఘవేంద్ర ఫెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసుస్టేషన్‌లో ఎస్సై సత్యనారాయణకు ప్రింటర్ అందజేశారు. రాఘవేంద్ర ఫర్టిలైజర్ అండ్ ఫెస్టిసైడ్స్ ప్రొప్రైటర్ కేశెట్టి రాఘవేంద్ర, ఆర్య వైశ్య మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీశ్‌బాబు, ఫర్టిలైజర్ సిబ్బంది వెంకట్‌రెడ్డి, శ్రావణ్, శ్రీధర్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే ప్రజలు తమ ఇళ్లు, వీధులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని యునాని వైద్యాధికారి వడ్లకొండ మారుతి సూచించారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఇంటి ఆవరణలోని వ్యర్థాల్లో వర్షంనీరు నిలిస్తే దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఇవి దాడి చేయడం ద్వారా జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, జలుబు, దగ్గు వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

అందుబాటులో యునాని

యునాని వైద్యంలో అన్నిరకాల వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ మారుతి తెలిపారు. ప్లేట్‌లెట్స్ తగ్గాయని ఏమాత్రం ఆందోళన పడొద్దన్నారు. సమీపంలోని వైద్యాధికారుల సూచనల మేరకు వైద్యసేవలు పొందాలన్నారు. ప్లేట్‌లెట్స్ పెంచేందుకు బొప్పాయి ఆకురసం, కాయలు తినడం మంచిదని సూచించారు.


జ్యోతినగర్: పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


ఫెర్టిలైజర్‌సిటీ: టౌన్‌షిప్‌లో..


సుల్తానాబాద్‌లో..


ముత్తారం: పారుపల్లి మల్లన్న గుడి వద్ద..


యైటింక్లయిన్‌కాలనీ: శ్రీనాగుల మల్లికార్జునస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు


కమాన్‌పూర్: పాలు పోస్తున్న భక్తులు


కాల్వశ్రీరాంపూర్‌లో..


ఎలిగేడు: ధూళికట్టలో..

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు

జ్యోతినగర్/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/ఎలిగేడు/యైటింక్లయిన్‌కాలనీ/ఫెర్టిలైజర్‌సిటీ/ముత్తారం/కమాన్‌పూర్: నాగుల పంచమిని పురస్కరించుకొని మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అర్చకులు పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాల్లోని పాము పుట్టలను భక్తితో పూజించి, పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించారు. నాగదేవతకు నూతన వస్త్రాలు, పూలు, పండ్లు, పాయసం నైవేద్యంగా సమర్పించారు.


జూలపల్లి: శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో..

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న కాలనీవాసులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్‌లో చైతన్యపురికాలనీలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ఆధ్వర్యంలో మంగళవారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రతపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. నీరు నిలిచిన ప్రదేశాల్లో దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా ఆయిల్‌బాల్స్ వేశారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్త తొలగించి కార్పొరేషన్ ట్రాలీలో వేయాలని సూచించారు. వార్డ్ ఆఫీసర్ సాయి, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగు నాగభూషణం, శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినూత్నంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మొక్క నాటుతున్న పూర్వ విద్యార్థులు, ప్రోత్సాహకం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్‌లో 1976–77లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సుమారు 48ఏళ్ల తర్వాత సోమవారం ఆత్మీయ సమ్మేళనం వినూత్నంగా జరుపుకున్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన గురువులకు, స్నేహితులకు మౌనం పాటించి, నివాళి అర్పించారు. 2024–25లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న 1976–77 బ్యాచ్ పూర్వ విద్యార్థులను హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్ఎం సునీత, వ్యాఖ్యాత తెలుగు ఉపాధ్యాయుడు డి.రవీందర్, పూర్వ విద్యార్థులు సత్యనారాయణరెడ్డి, మాధవరెడ్డి, సల్పాల రాజయ్య రఘుపతిరావు, హరిప్రసాద్, కృష్ణకుమార్, వెంకన్న, జనార్దన్, ఆనందం, అశోక్‌రెడ్డి, సదానందం, రాజమల్లయ్య, శేఖర్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వకర్మ శివాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం


బ్రహ్మోత్సవాల్లో మనాలిఠాకూర్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీవిశ్వకర్మ శివాలయం 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలిఠాకూర్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగులమల్యాల రాజమౌళి, కాంగ్రెస్ నాయకులు రాజేశ్, శంకర్ నాయక్, జక్కుల దామోదర్‌రావు, చక్రపాణి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఇసుక లారీ పట్టివేత

సుల్తానాబాద్‌రూరల్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. గోదావరఖని నుంచి హైదారాబాద్‌కు అక్రమంగా ఇసుకను లారీలో తరలిస్తుండగా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రీనగర్ వద్ద రాజీవ్ రహదారిపై పెట్రోలింగ్ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్ వాసవేని శ్రీనివాస్, ఓనర్ విలాసాగరం సిద్ధుపై కేసు నమోదు చేసి, లారీని సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

• మండల కార్యవర్గం ఖరారు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఖరారు చేసుకున్నారు. అధ్యక్షుడిగా వనపర్తి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గంధం శ్రీనివాస్, కోశాధికారిగా ఇరుగురాల శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సలహాదారులు తూర్పాటి మోహన్, తూర్పాటి జగన్, కొమురయ్య, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు.

• ప్రభుత్వ విద్యార్థులకు షూస్ అందజేత

గోదావరిఖనిటౌన్: స్థానిక చంద్రబాబుకాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ, హాలీవుడ్ షూస్ నిర్వాహకులు షేక్ జాన్‌మహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం షూస్ అందజేశారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఖని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పూదరి కుమార్ హాజరై విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు రామలక్ష్మి, స్వప్న, నాయకులు బొల్లం మధు, టి.అనిల్ ఉన్నారు.

• రైతులకు భూభారతి నోటీసులు జారీ

ఓదెల: మండలంలో భూభారతి సదస్సులలో దరఖాస్తులు సమర్పించిన రైతులకు తహసీల్ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. మండలంలోని 22 గ్రామాల్లో భూభారతి కింద రైతుల సమస్యల పరిష్కారం కోసం నోటీసులు అందజేస్తున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు. ఆగస్టులో భూభారతి కింద రైతుల సమస్యల పరిష్కారం కోసం సిద్ధంగా అధికారులు ఉన్నట్లు సమాచారం.

• గురుకుల పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

గోదావరిఖనిటౌన్: సింగరేణి సీఎండీ బలరాం నాయక్ జన్మదినం సందర్భంగా బలరాంనాయక్ సోషల్ మీడియా రామగుండం కన్వీనర్ శ్రీహరి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బీసీ గురుకుల బాలికల పాఠశాలలో సింగరేణి ఫారెస్ట్ డీవైజీఎం కర్ణ నాయక్ చేతుల మీదుగా వాల్ మౌంట్ ఫ్యాన్లు అందజేశారు. స్థానిక ప్రధాన చౌరస్తా పోచమ్మ ఆలయం వద్ద పేదవారికి భోజనం అందించారు. సామాజిక కార్యకర్తలు సురేశ్, రవి, సంపత్, అమ్రేష్, అనిల్‌కుమార్, రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

• అన్నప్రసాద వితరణ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని గౌడ కులస్తులు శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పాటు తిరుగువారం చేసి అన్న వితరణ చేశారు. నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత, గడ్డం అంజయ్యగౌడ్, పొన్నం తిరుపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, కరుణాకర్‌గౌడ్, శివగౌడ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: శ్రావణమాసం సందర్భంగా రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ హనుమాన్ ఆలయంలో శ్రావణమాస మొదటి మంగళవారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సౌమిత్రి సుమంత్ చార్యులు స్వామివారి మూలవిరాట్‌కు ఉదయం ఫల పంచామృతాలతో అభిషేకం చేశారు.

అయ్యప్ప ఆలయంలో ఉత్తర నక్షత్ర పూజలు


అభిషేకం చేస్తున్న అర్చకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీహరిహర సుత అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప జన్మ నక్షత్రం ఉత్తర నక్షత్రను పురస్కరించుకొని మంగళవారం అర్చకులు అశోక్ శర్మ పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఆలయాల్లో శ్రావణ శోభ



జ్యోతినగర్: ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం శ్రావణ శోభ సంతరించుకుంది. ఎన్టీపీసీ రామగుండం రింగ్ రోడ్ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు గోపినాథ్ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆంజనేయస్వామి దీక్షా స్వాములు పాల్గొన్నారు.

ఇంటర్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికల) కళాశాలలో మిగిలిన ఇంటర్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గిరిజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో చేరడానికి అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 31న ఉదయం 9గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

గుంతలమయంగా రహదారి



కమాన్‌పూర్: మండల కేంద్రం నుంచి పేంచికల్‌పేట గ్రామం మీదుగా గోదావరిఖని వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు చేపట్టి రహదారి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని శ్రీనాగుల మల్లికార్జునస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు సమీపంలోని మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్ పగిలిపోయింది. దీంతో నీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. స్థానికులు గమనించి వాటర్ సప్లై సిబ్బందికి తెలపడంతో 20రోజుల క్రితం పైపులైన్ లీక్ అయిన ప్రాంతంలో గుంత తీసి వదిలేశారు. దీంతో వర్షం నీటితో పాటు బురద నీరు తాగునీటిలో కలిసి తాగునీరు కలుషితం అవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. నీటి సరఫరా సమయంలో తాగునీరు సైతం వృథాగా రోడ్డుపై పారుతోందంటున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే పైపులైన్‌కు మరమ్మతు చేసి గుంతను పూడ్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..



మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఏరియాలో సర్ఫేస్ ఖాళీలను భర్తీచేయాలి


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో డిజిగ్నేషన్ల వారీగా సర్ఫేస్ ఖాళీలను భర్తీచేయాలని దీంతో డిప్యూటేషన్లు తగ్గి సీనియర్లకు న్యాయం జరుగుతుందని గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌ను కోరారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన స్ట్రక్చరల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల పిల్లలకు బేసిక్ ఇన్షియల్ ట్రెనింగ్ కోసం ఎంవీటీసీకి ఐదు ఏరియాల (ఇల్లందు, కొత్తగూడెం, మణుగూరు, భూపాలపల్లి, ఆర్జీ–1) యువ ఉద్యోగులను పంపుతున్నారన్నారు. దీంతో కార్మికుల పిల్లలతో పాటు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు బ్యాచ్‌ల వారిగా ట్రెనింగ్ ఇవ్వడంతో 5 నుంచి 6నెలల సమయం పడుతోందన్నారు. ఏరియా వర్క్‌షాప్‌లో మహిళా కార్మికులకు వాష్‌రూంలు ఏర్పాటు చేయాలన్నారు. జీడీకే–1వ గనిలో నాసిరకం టూల్స్ వస్తున్నాయని, వాటిస్థానంలో నాణ్యమైనవి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పవర్‌హౌస్‌కాలనీలోని శివాలయం పక్కనున్న క్రీడా మైదానాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జీడీకే–11వ గనిలో చైర్ లిఫ్ట్ ఏర్పాటు చేసి దూరభారం తగ్గించాలని, రూఫ్‌బోల్టర్ కొత్తది ఏర్పాటు చేయాలన్నారు. జీడీకే–5 ఓసీపీలో ఫోర్‌వీలర్ పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు అరెల్లి పోషం, మహేశ్, అశోక్, వెంకటరెడ్డి, సిద్ధమల్లరాజు, మల్లిఖార్జున్, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, అధికారులుచిలక శ్రీనివాస్, డి.రమేశ్, ఆంజనేయులు, రమేశ్, జితేందర్ సింగ్, ధనలక్ష్మీబాయి, అంబిక, వసంత్‌కుమార్, వేణు, హన్మంతరావు, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు అందజేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సుమారు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి రాజేందర్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్‌లో మంగళవారం కార్మికులను కలిసి కరపత్రాలు విడుదల చేశారు. కోలిండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు అందజేయాలని కోరారు. కార్మికుల కనీస వేతనాల విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో 18రోజులు సమ్మె చేసిన సమయంలో జరిగిన ఒప్పందం మేరకు జీవో22 విడుదల చేసినా ఇప్పటికీ అమలు కాలేదన్నారు. హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున సింగరేణివ్యాప్తంగా పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. నాయకులు రాజు, రమేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

ఆర్జీ–3లో సింగరేణి ఫారెస్ట్రీ అడ్వయిజర్ పర్యటన

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–1, 2 ఉపరితల గనుల్లో మంగళవారం సింగరేణి ఫారెస్ట్రీ అడ్వయిజర్ ఎం.సి.ఫర్గెయిన్ పర్యటించారు. ఓసీపీ–2 ఉపరితల గని పరిధిలోని ఓబి డంపుపై ఉన్న 65 హెక్టార్ల భూమిని అటవీశాఖకు అప్పగించడానికి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఓసీపీ–1లోని ఓబి డంప్‌పై నాటిన మొక్కలను పరిశీలించారు. రామగుండం–3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఏరియాకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. డీఎఫ్‌వో శివయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్లు సీహెచ్ వెంకటరమణ, జె.రాజశేఖర్, ఫారెస్ట్ అధికారి బి.కర్ణ, ఎస్టేట్స్ విభాగాధిపతి కె.ఐలయ్య, సర్వే విభాగాధిపతి డి.జనార్ధనరెడ్డి, ఎఫ్‌ఆర్‌వో రమేశ్, పర్యావరణ అధికారులు కిషన్, టి.నాగేశ్వరరావు, జూనియర్ ఫారెస్ట్ అధికారి మేఘన పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్యం విషయంలో యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఆర్జీ–1 ఏరియా ఎస్‌వోటూ జీఎం ఆంజనేయప్రసాద్ అన్నారు. ఆర్జీ–1 ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం సుందిళ్లలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మ, డాక్టర్ అంబిక, డాక్టర్ ప్రశాంత్ సిబ్బందితో కలిసి గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యశిబిరానికి హాజరైన 200మందికి వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి గ్రామ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆవుదుర్తి శ్రీనివాస్‌నాయీ, ఉపాధ్యక్షులుగా జనగామ సురేష్‌నాయీ, ఆవుదుర్తి తిరుపతినాయీ, ప్రధాన కార్యదర్శిగా సూరంపల్లి సంపత్‌నాయీ, గౌరవ అధ్యక్షుడిగా రామస్వామి నాయీ, కోశాధికారిగా ఎలగందుల రమేశ్‌నాయీ, గౌరవ సలహాదారులుగా రవినాయీ, ప్రచార కార్యదర్శిగా సంపత్‌నాయీని ఎన్నుకున్నారు.